జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com






# ఈ మరణం.. ఎవరి..

# నిర్లక్ష్యం..!



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 24 (వార్త):** ఈ పాపం ఎవరిది? ఈ నిర్లక్ష్యానికి ఎవరు బాధ్యులు? మృతి చెందిన వారి కుటుంబానికి పరిహారం ఇచ్చి చేతులు దులిపేసుకుంటే సరిపోతుందా? వారి కుటుంబాలకు ఎవరు అండగా ఉంటారు? వారి పిల్లల కన్నీళ్లు తుడిచేవారు ఎవరు? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలు.. కొందరు నిర్లక్ష్యం.. కొన్ని కుటుంబాలకు ఆసరా లేకుండా చేసింది. తండ్రి లేకుండా చేసింది. పత్రికల్లో కుళాయిలు.. డ్రైనేజీల్లోనే ఉంటున్నాయని, ఆ నీరు విషంగా మారుతోందని, ట్యాంకుల్లో సక్రమంగా క్లోరినేషన్ జరగడం లేదని పలు కథనాలు వచ్చినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఏం జరుగుతుందిలే.. జరిగిన తర్వాత చూద్దాంలే అన్న కొందరు నగరపాలక సంస్థ అధికారుల వల్లే ఈ నష్టం జరిగింది. అవును వారి వల్లే అనర్థం. ఏకంగా కలెక్టరే స్వయంగా కుళాయి నీరు తాగవద్దని చెప్పారంటే.. పరిస్థితి ఇట్టే అర్థం చేసుకోవచ్చు. మంగళవారం వరకూ శ్రీకాకుళం నగరంలోని దమ్మలవీధి, గోల్కొండరేవు వీధి, కాకివీధి, మంగువారితోట తదితర ప్రాంతాల్లో డయేరియా కేసులు అధికారికంగా 54 కేసులు.. అయితే ఈ కేసులు మరింతగా ఉండవచ్చు. మంగళవారం ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురు మృతి చెందినట్టు కుటుంబీకులు చెబుతుంటే.. అధికారులు మాత్రం నిర్ధారించడం లేదు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో వైద్యఆరోగ్యశాఖ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు అందిస్తున్నారు. మరికొందరికి రిమ్స్, జెమ్స్, కిమ్స్, తదితర ఆసుపత్రులకు తరలించి సేవలు అందిస్తున్నారు. మంగువారితోట ప్రాంతంలోని కంద్రవీధికి చెందిన మండల సురేష్(43) మంగళవారం మృతి చెందాడు. అలాగే దమ్మలవీధికి చెందిన దుత్త లక్ష్మణరావు, ఎస్.నరసింగరావుతో పాటు గోల్కొండరేవు రోడ్డుకు చెందిన అంధవరపు సంతోష్ మృతి చెందారు. అయితే వారు అనారోగ్య సమస్యల వల్ల చనిపోయారని అధికారులు చెబుతున్నారు. అయితే వారంతా డయేరియా వ్యాప్తి చెందిన ప్రాంతానికి చెందినవారే కావడంతో డయేరియాతో మృతి చెంది ఉంటారని కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

* శ్రీకాకుళంలో డయేరియాతో ఒకరు మృతి.. మరికొందరు అస్వస్థత
* ఆసుపత్రిల్లో చికిత్స పొందుతున్న మరో 54 మంది
* కలుషిత నీరు తాగడం వల్లే డయేరియా
* అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల పాలిట శాపం
* గతంలోనే 'జాతీయ వార్త' కథనం
* అయినా పట్టించుకోని అధికార గణం
* బాధితులకు మెరుగైన వైద్యం అందించండి: సీఎం
* ఆందోళన వద్దు.. అండగా ఉంటాం: రామ్మోహన్
* అండగా కూటమి ప్రభుత్వం: అచ్చెన్న
* అదుపులోనే అతిసారం: కలెక్టర్
* మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు పరిహారం: ఎమ్మెల్యే గొండు
* ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే: వైసీపీ నేతలు
* బాధితులను పరామర్శిస్తున్న నేతలు
* డయేరియా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు
* ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో పలువురికి చికిత్స

## మెరుగైన వైద్యం అందించండి: సీఎం

డయేరియా బారిన పడిన వారికి మెరుగైన వైద్య అందించాలని సీఎం చంద్రబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళంలో రోడ్డు మరమ్మతులు కారణంగా డయేరియా వ్యాప్తి చెందివుంటుందని జిల్లా అధికారులు సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. డయేరియా బాధితులకు చికిత్స అందిస్తున్నామని ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం.

## డయేరియా బాధిత కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం: మంత్రి అచ్చెన్న



శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలో డయేరియా కారణంగా తుది శ్వాస విడిచిన మృతుని కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం నిలిచింది. రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం తరపున పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటూనే, ఇతర బాధిత కుటుంబాలకు సైతం ఆరోగ్య రీత్యా మెరుగైన వైద్యం అందేవిధంగా, వైద్యుల నిరంతర పర్యవేక్షణ ఉండేవిధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. బాధిత ప్రజలు ఎవ్వరూ అధైర్య పడవద్దన్నారు.

## ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండండి : రామ్మోహన్

శ్రీకాకుళం నగరంలోని కొన్ని ప్రాంతాలలో డయేరియ కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకూ నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కోరారు. డయేరియా కేసులు పెరగడం, ఇదే కారణాలతో శ్రీకాకుళం నగరవాసి ఒకరు మృతి చెందడంతో మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లతో కలసి స్థానిక పరిస్థితులను సమీక్షిస్తూనే.. ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని ముఖ్యమంత్రి కార్యాలయంకు సైతం చేరవేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం జిల్లా అధికారులతో తాజా పరిస్థితులపై వర్చువల్ సమావేశం నిర్వహించారు. అదేవిధంగా డయేరియా కారణంగా మృతి చెందిన వ్యక్తికి పది లక్షల రూపాయల తోడ్పాటును సైతం ప్రకటించారు. విపత్కర పరిస్థితులో పూర్తి భరోసా అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఇంకోవైపు జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సైతం నిత్యం తాజా పరిస్థితులపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమీక్ష నిర్వహిస్తూ పలు కీలక సూచనలు చేశారు. త్వరితగతిన సాధారణ పరిస్థితులు వచ్చేలా చెయ్యాలని ఆదేశించారు. పూర్తి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచడం, స్థానికంగా ఆరోగ్యశిబిరాల ఏర్పాటు, పరిశుభ్రతగా పరిసరాలు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.





జాతీయ వార్త తెలుగు దిన పత్రిక

www.jatheeyavaartha.com
02 Dec 2025 - Page 1

# కుళాయి నీరు.. సురక్షితమేనా?

* శ్రీకాకుళం నగరపాలక సంస్థలో సక్రమంగా జరగని క్లోరినేషన్ * రోజుకు రెండు పూటలు చేయని క్లోరినేషన్ * ఒక్కపూటకే పరిమితమైన కాంట్రాక్టర్ * లక్షల్లో బిల్లులు చేసుకుంటున్న వైనం * తనిఖీలు చేయని హెల్త్ అధికారులు * రోగాల బారిన నగరవాసులు * ప్రజల ఆరోగ్యంతో చె(జ)లగాటం

**శ్రీకాకుళం, డిసెంబర్ 1 (వార్త):** శ్రీకాకుళం నగరవాసులకు నిత్యం కుళాయిల ద్వారా నగరపాలక సంస్థ అధికారులు నీటిని అందిస్తున్నారు. అయితే ఈ నీరు ఎంతవరకు సురక్షితమన్నది తనిఖీ చేయాల్సిన మున్సిపల్ హెల్త్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. కుళాయిల ద్వారా పంపిణీ చేస్తున్న నీటిని రోజుకు రెండు పూటలు క్లోరినేషన్ చేయాలి. కాని సంబంధిత కాంట్రాక్టర్ రోజుకు ఒక్కసారి మాత్రమే క్లోరినేషన్‌ను నామమాత్రంగా చేస్తున్నారని ఈ ప్రక్రియ చేపడుతున్న సిబ్బందే బహిరంగంగా చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోని 14 ట్యాంకులను క్లోరినేషన్ చేయాల్సిన బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్‌కు నగరపాలక సంస్థ అధికారులు అప్పగించారు. రెండు సార్లు చేస్తున్నట్టు కాంట్రాక్టర్ మాత్రం లక్షల్లో బిల్లులు జేబులో వేసుకుంటున్నాడు. ఈ క్లోరినేషన్ ప్రక్రియను నగరపాలక సంస్థ హెల్త్ అధికారులు పరిశీలన చేయకపోవడంతో కాంట్రాక్టర్‌కు వరంగా, నగరవాసులకు శాపంగా మారింది. క్లోరినేషన్ చేయని నీటిని తాగుతున్న నగరపాలకవాసులు రోగాల బారిన పడి ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇకనైనా నగరపాలకసంస్థ అధికారులు స్పందించి ఈ క్లోరినేషన్ ప్రక్రియను తనిఖీ చేసి ప్రజలకు సురక్షిత నీటిని అందించాల్సివుంది.

## తాళ్లవలసలో డయేరియాపై సీఎం ఆరా

* పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం, కలుషిత నీరే కారణమంటున్న గ్రామస్థులు * గ్రామంలో వైద్యసేవలు అందించండి: మంత్రి అచ్చెన్నాయుడు * గ్రామంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

సంతబొమ్మాళి, డిసెంబర్1 (వార్త): సంతబొమ్మాళి మండలం తాళ్లవలస గ్రామంలో డయేరియా వ్యాధి విజృంభించి ఒకరు మృతి చెందగా, పలువురు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. మార్పు చిన్నారావు (72) టెక్కలి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గున్న రుద్రమ్మ, గున్న పాపారావు, సీపాన కొండయ్య, చల్ల రాములు తదితరులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అలాగే కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బండారు గోవిందరావుకు శ్రీకాకుళం రిమ్స్ చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు సరిగా నిర్వహించకపోవడం వల్ల డయేరియా సోకిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామంలో పంటచేల మధ్యనున్న నేలబావి నీరు ఇంటింటి కుళాయిల ద్వారా సరఫరా చేయడంతోనే డయేరియా సోకి వుంటుందని వాపోయారు. వైద్యులు, సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు, బావులలో క్లోరినేషన్ చేశారు. తాళ్లవలస గ్రామంలో డయేరియా వ్యాప్తి చెందిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తక్షణమే స్పందించారు. ఈ విషయమై ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి, గ్రామంలో నెలకొన్న పరిస్థితుల వివరాలను తెలుసుకున్నారు. డయేరియా వ్యాప్తిని అరికట్టేందుకు తక్షణమే గ్రామాన్ని సందర్శించి, సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఆ గ్రామానికి వైద్య బృందాలను పంపించి, బాధితులకు అత్యవసర చికిత్స అందించాలని, శుభ్రతా చర్యలను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. తాళ్లవలసలో డయేరియా కేసుల నమోదుపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. వృద్ధుడి మరణానికి కిడ్నీ సమస్య, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూరే కారణమని వైద్యారోగ్యశాఖ అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

# గ్రూప్-ఏ అధికారిగా గెడ్డవూరు వాసి సురేష్



**- కాగ్ కార్యాలయంలో**
**ఉన్నత గణాంకాకారిగా నియామకం**

**మందస, ఫిబ్రవరి 24(వార్త):** భారత రాష్ట్రపతి ఆమోదంతో విడుదలైన అధికారిక ఉత్తర్వుల మేరకు గెడ్డవూరు గ్రామానికి చెందిన వంక సురేష్ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(సీఏజీ) కార్యాలయంలో ఉన్నత గణంకాధికారిగా నియమితులయ్యారు. గ్రూప్-ఏ పదోన్నతి పొందినట్లు సీఏజీ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన దున్న పూరు పంచాయతీ గెడ్డవూరు గ్రామానికి చెందిన సురేష్ సామాన్య, మత్స్యకార కుటుంబంలో జన్మించారు. ఎంతో కష్టపడి అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ చదువు ప్రతీ ఒక్కరి జీవితంలో మార్పును తీసుకొస్తుందని, తలరాతను మార్చేది చదివేనన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.గెడ్డవూరు గ్రామంలో జన్మించి ఇంతటి ఉత్తమ స్థాయిలోకి రావడం గ్రామానికి గర్వకారణమని కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామ ప్రజలతో పాటు పలువురు సురేష్‌ను అభినందించి, ఆనందం వ్యక్తం చేశారు.

## రెండో రోజూ కొనసాగిన..
# అంగన్‌వాడీల నిరాహార దీక్ష



**మందస, ఫిబ్రవరి 24(వార్త):** అంగన్ వాడీల సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మందసలోని అంగన్ వాడీలు సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్ వాడీ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రెండు రోజుల దీక్షలలో రెండవ రోజు మంగళవారం మండలంలోని అంగన్ వాడీలు, హెల్పర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్. గణపతి, కె.కేశవరావు, యూనియన్ నాయకులు మాట్లాడుతూ అంగన్ వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలను అంగన్ వాడీలకు వర్తింపచేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటి ఇవ్వాలని, ఐసీడీఎస్ కు బడ్జెట్ లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్స్ గతంలో అంగీకరించి అమలు చేస్తామని హామీ ఇచ్చి.. మినిట్ కాపీ కూడా ఇచ్చి, అమలు చేయకుండా తాత్సారం చేయడం సరైనది కాదన్నారు. అంగన్ వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఈ నెల 25, 26 తేదీలలో జిల్లా కేంద్రంలో జరిగే దీక్షలను, మార్చి 2న విజయవాడ మహా ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎస్.భానుమతి, బి.గీతాంజలి, డి,దివ్య, పి.కృష్ణవేణి, కె.రాజేశ్వరి, ఎస్.జ్ఞానేశ్వరి, కె.శ్రీదేవి, ఎ.చామంతి జి.ఖాజల్, పి.జమున, ఎన్.తులసమ్మ, వి.భాగ్యలక్ష్మి కె.కళావతి, జి.జమున తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణ

**-క్షేత్రస్థాయిలో అవగాహనా సదస్సులు**
**-హార్టికల్చర్ ఆధ్వర్యంలో**
**ఇతర జిల్లాల్లో పర్యటన**
**-ఆయిల్ పామ్ సాగు మేలంటున్న**
**ఉద్యానవనశాఖాధికారులు**



**మందస, ఫిబ్రవరి 24(వార్త):** జిల్లాలో ఆయిల్ ఫామ్ విస్తరిస్తోంది. ఈ సాగుపై ఉద్యానవనశాఖాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి, శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వం ఆయిల్ఫామ్ పంటకు సబ్సిడీ కల్పిస్తుండడంతో రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. దీనిలో భాగంగా శ్రీకాకుళం జిల్లా, పార్వతీపురం-మన్యం జిల్లాల్లో రైతులతో ఉద్యానవనశాఖాధికారులు పర్యటిస్తున్నారు. పంట సాగు ఎలా చేయాలి.. దిగుబడి ఎలా పొందాలి.. ఆదాయ, వ్యయంపై శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ ఎలా వస్తుంది.. ఎలా సద్వినియోగం చేసుకోవాలి.. తదితర అంశాలపై పలాస ఉద్దానవనశాఖాధికారి సీహెచ్ శంకర్ దాసు ఆధ్వర్యంలో అవగాహన, శిక్షణ కల్పిస్తున్నారు. ఈ మేరకు మందస, పలాస, సోంపేట మండలాలకు చెందిన రైతులను ఆయిల్ పామ్ సాగు చేస్తున్న ఇతర జిల్లాలు, మండలాలకు తీసుకెళ్లి.. శిక్షణ కల్పించారు. హార్టికల్చర్ డిపార్ట్ మెంట్ సహకారంతో శ్రీ శ్రీనివాసా పామ్ ఆయిల్ మిల్ ను రైతులు సందర్శించారు. హార్టికల్చర్ ఆఫీసర్ సీహెచ్ శంకర్ దాస్, హార్టికల్చర్ ఎక్సటెన్షన్ ఆఫీసర్స్ వెన్నెల, నీలిమ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. శ్రీనివాస ఆయిల్ పామ్ కంపెనీ డీజీఎం ప్లాంటేషన్ మేనేజర్ జి.వీరబాబు. ఫీల్డ్ ఆఫీసర్ పి.సోమేశ్వరావు పాల్గొని ఆయిల్ పామ్ సబ్సిడీలను, ప్రయోజనాలు, కంపెనీ కల్పించే సర్వీస్ లను వివరించారు. సోంపేట, మందస, పలాస రైతులకు ఆయిల్ పామ్ ఎక్స్‌పోజర్ సందర్శన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలం లింగాలవలస గ్రామం శ్రీశ్రీనివాస పామ్ ఆయిల్ మిల్లు, పార్వతీపురం-మన్యం జిల్లా వీరఘట్టం మండలం కంబర గ్రామంలో ఉన్న ఆయిల్ పామ్ తోటలు, ఫ్యాక్టరీ సందర్శించారు. మూడు మండలాల రైతులతో పాటు కంబర గ్రామ అధ్యక్షురాలు కె.లలిత, జి.వీరబాబు, డీజీఎం ప్లాంటేషన్ పి.సోమేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలాభివృద్ధే టీడీపీ ధ్యేయం

**- రూ.21 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు - పీఏసీఎస్ అధ్యక్షుడు సలాన మోహనరావు**





**మెళియాపుట్టి, ఫిబ్రవరి 24(వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వంలో అన్ని రంగాలతో పాటు ప్రతి మారుమూల పల్లెకు సైతం రహదారి సౌకర్యం కల్పించడమే జయముగా ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని కోసమాల పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహన రావు అన్నారు. మండలంలో గల జోడూరు పంచాయతీలో రాజపురం గ్రామం నుండి స్మశాన వాటికకు వెళ్లే రహదారిలో 7 లక్షల 70 వేలు రూపాయలతో సిమెంట్ రోడ్డు నిర్మాణమునకు అలాగే అదే పంచాయతీలో జెన్నిబంద నుండి సవర సజ్జినాపురం గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణానికి 13 లక్షల 70 వేలు రూపాయలు మంజూరు కావడంతో బుధవారం పిఎసిఎస్ అధ్యక్షులు పై రహదారులకు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి అనే అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు గౌడ సంఘ రాష్ట్ర డైరెక్టర్ భాస్కర్ గౌడ్, పాతపట్నం ఏఎంసి చైర్మన్ ప్రతినిధి బైరిసింగి దినకర్, మండల పార్టీ అధ్యక్షులు నంబాల వెంకట్రావు, మండల ప్రధాన కార్యదర్శి యు. వసంత్, దేశం పార్టీ సీనియర్ నాయకులు ఇప్పిలి కృష్ణరావు మాస్టర్, సయ్యద్ సిలార్, పూర్వపు సర్పంచులు అజయ్ కుమార్, శ్రీనివాసరావు, లుకలాపు



భాస్కరరావులతోపాటు మండల తెలుగు యువత అధ్యక్షులు బస్వ పరమేశ్వర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ పడాల శ్రీను, అతపాకల కోదండరావు, బూరెల శ్రీనివాసరావు, జీరి కృష్ణారావు, బడే కోదండ, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు యువకులు తదితరులున్నారు.




## పరీక్షా కేంద్రాల్లో ..
# జాగ్రత్తలు తీసుకోవాలి

**మందస, ఫిబ్రవరి 24(వార్త):** ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాశీబుగ్గరూరల్ సీఐ పి.తిరుమలరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు.

మందస మండలంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలకు హాజరైన ప్రతీ విద్యార్థులను చెక్ చేయాలని, బయట వ్యక్తులు పరీక్షా కేంద్రాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థినీ, విద్యార్థులను వేర్వేరుగా చెక్ చేయాలన్నారు. కాంపౌండ్ వాల్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు అవసరమన్నారు. మందస మండలంలో మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలిగాం వద్ద ఆదిత్య కళాశాలలో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. అనంతరం మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. పిల్లల సురక్షితంగా ఉండాలని, తప్పుడు తాకిడులను గుర్తించాలన్నారు. ఎవరైనా తప్పుగా లేదా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. కాశీబుగ్గరూరల్ సీఐ పి.తిరుమలరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తో పాటు సిబ్బంది, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆటోవాలా నిజాయతీ

**కంచిలి, ఫిబ్రవరి 24(వార్త):** కంచిలికి చెందిన ఆటో డ్రైవర్ దుదిష్టి సాహు తన నిజాయితీని నిరూపించుకున్నాడు. ఆర్టీసీలో డ్రైవర్ గా ఉద్యోగ విరమణ అనంతరం ఆటో రిక్షా నడుపుకుంటూ కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం కంచిలి రైల్వే స్టేషన్ నుంచి తన ఆటోలో ఎక్కిన మజ్జిపుట్టుగా గ్రామానికి చెందిన శకుంతల మజ్జి తన గ్రామం వద్ద ఆటో దిగి ఆటోలోనే తన పర్సును మరిచిపోయింది. యధావిధిగా తిరిగి కంచిలి చేరుకున్న ఆటో డ్రైవర్ ఆటోలో పడి ఉన్న పర్సును గమనించి తిరిగి ఆ గ్రామానికి వెళ్లి సదరు మహిళలకు మనీ పర్స్ ను అప్పగించాడు. అందులో రెండు తులాల బంగారం వస్తువు తో పాటు 5000 రూపాయలు నగదు ఉండడాన్ని తిరిగి వాటిని స్వాధీనం చేయడంతో బాధిత కుటుంబీకులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ దూదిష్టి సాహును అభినందించారు. కన్ను మూసి తెరిచే సమయంలో ఎంతో విలువైన వస్తువులు మాయమైపోతున్న నేటి రోజుల్లో మర్చిపోయిన లక్షలాది రూపాయలు విలువైన వస్తువులు, నగదు తిరిగి అప్పగించడం దుదిష్టి నిజాయితీ కి నిదర్శనం అని స్థానికులు అభినందనలు తెలిపారు.



# పల్లె..పల్లెల్లో పారదర్శక ఆదాయ సర్వే



**మందస, ఫిబ్రవరి 24(వార్త):** పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ఫ్) రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మహిళా సంఘాల కుటుంబ సభ్యుల ఆదాయ స్థాయి, వారి కుటుంబానికి వాస్తవం గా కావలసిన జీవనోపాదులను గుర్తించడానికి పారదర్శక కుటుంబ ఆదాయ సర్వే చేపడుతున్నట్లు వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండల కేంద్రంలో సర్వే నిర్వహిస్తున్న ఈనారీ సీఆర్పీలతో మాట్లాడుతూ అవసరమైన రుణ పరపతి సౌకర్యాన్ని కల్పించడానికి పల్లె పల్లెలో సర్వే చేస్తున్నామన్నారు. యాప్ వినియోగం లో లోటుపాట్లు ను అడిగి తెలుసుకొని, వారి కుటుంబ ఆదాయాన్ని ఖచ్చితంగా తెలుసుకొని వాస్తవంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘం కుటుంబ సభ్యులలో వాస్తవంగా యాక్టివిటీ ఉండి సంపాదిస్తున్న, అందరి ఆదాయం కూడా ఖచ్చితంగా పారదర్శకంగా నమోదు చేసుకోవాలని, భవిష్యత్ లో వారికి అవసరమైన పరపతి ఋణ సౌకర్యాలు అవసరాన్ని బట్టి అవకాశాలను వివరించారు. ఈ విధమైన సర్వే మన జిల్లాతో పాటు రాష్ట్రం మొత్తం అన్ని స్వయం సహాయక సంఘాల మహిళలు కుటుంబాలలో కూడా శిక్షణ పొందిన ఈనారీ సీఆర్పీల ద్వారా పక్కా పారదర్శకంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వెలుగు డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావుతో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, రమేష్, గ్రామ సంఘం ప్రతినిధులు, ఈనారీ సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే బగ్గు

- మహిళలకు రాజకీయ ప్రోత్సాహంపై చర్చ

**నరసన్నపేట, ఫిబ్రవరి 24(వార్త):** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను సోమవారం రాత్రి నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు మాజీ జడ్పీటీసి బగ్గు సుగుణమ్మ, నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త బగ్గు అర్చన కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్న బగ్గు అర్చనను మంత్రి లోకేష్ అభినందించారు. మహిళలు రాజకీయాల్లోకి ముందుకు రావాలని, వారికి టిడిపి పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై కూడా చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశం సానుకూల వాతావరణంలో జరిగింది.



# అటో..ఇటో..అయిపోతారు..!

- -నరసన్నపేటలో ఆటోల్లో ప్రమాదకర ప్రయాణాలు
- - పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు
- - స్థానికుల ఆందోళన



**నరసన్నపేట, ఫిబ్రవరి 24(వార్త):** నరసన్నపేట ప్రధాన రహదారులపై ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిరోజూ పట్టణానికి వచ్చేవారు ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని చెబుతున్నారు. ఆటోల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులు ఎక్కించుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొంది. ముఖ్యంగా పాఠశాల, కళాశాల సమయాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోందని తెలిపారు. ఇలాంటి నిర్లక్ష్య ప్రయాణాలు ప్రమాదాలకు దారి తీసే అవకాశముందని, సంబంధిత అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# గుండకు అసెంబ్లీ నివాళులు

**శ్రీకాకుళం నగరం, ఫిబ్రవరి 24(వార్త):** మాజీ మంత్రి, దివంగత నేత గుండ అప్పల సూర్య నారాయణకు మంగళవారం ఏపీ అసెంబ్లీ నివాళు లర్పించింది. నిజాయతీకీ, నిబద్ధతకూ తార్కాణం అయి నిలిచే నాయకులతో గుండ అప్పల సూర్య నారాయణ నిలిచి ఉంటారని సభ్యులు నివాళులు ఇస్తూ సంతాపం ప్రకటించారు. తొలుత సంతాప తీర్మానాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు చదివి వినిపించారు. అనంతరం కీలక సభ్యులు మాట్లాడారు. గుండ కుటుంబంతో ఉన్న అనుబంధాన్నీ, ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలను స్మరించారు.

# ఆయన్ని స్మరించినందుకు ధన్యవాదాలు

-అసెంబ్లీకి మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి కృతజ్ఞతలు

**అరసవల్లి, ఫిబ్రవరి 24(వార్త):** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని.. దివంగత నేత, మాజీ మంత్రివర్యులు గుండ అప్పల సూర్య నారాయణకు సంతాపం తెలుపుతూ..స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా.. తన భర్తను స్మరించు కున్న ఏపీ అసెంబ్లీ సభ్యులకు, సభాపతికీ, ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుకూ..మాజీ శాసన సభ్యురాలు గుండ లక్ష్మీదేవీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. సుదీర్ఘ ప్రజా ప్రస్థానం సాగించిన నేతకు గౌరవ సూచకంగా ఓ బడుగుల నేతను స్మరిస్తూ..తెలుగు దేశం అధినేత నేతృత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం సభా సంప్రదాయాలను పాటిస్తూ..గౌరవ గుండ అప్పల సూర్యనారాయణ సేవలను తలుచుకోవ డంతో ఆమె కన్నీటి పర్యంతం అయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్నీ గుర్తు చేసుకుని కన్నీటి నివాళు లర్పించిన సభ్యులందరికీ పేరుపేరునా తన కృతజ్ఞ తాంజలి తెలిపారు. ప్రజా జీవితాన నీతి నిజా యితీలే ముఖ్యమని, వ్యవస్థలలో నిబంధనల పాటింపే ప్రాముఖ్య రీతికి సంకేతం అని తుది శ్వాస వరకూ నమ్మి పాటించిన వ్యక్తి అప్పల సూర్యనారా యణ అని సభ్యులు కీర్తించడం, మరోసారి ఆ మహానేతను గౌరవించుకోవడం తనను మరింత భావోద్వేగానికి గురిచేసిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.





**జలుమూరు, ఫిబ్రవరి 24(వార్త):** మాకివలసలో సతివాడ శ్రీనివాస్ కుమార్తె గాయత్రి ఓనీల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు హాజరై గాయత్రి నీ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా యువనాయకులు బాన్న వెంకన్న, తర్ర ఉపేంద్ర, శిమ్మ తారాకేష్ పాల్గొన్నారు.

అలాగే సీనియర్ నాయకులు గుజ్జిడి తాతన్న, శిమ్మ అప్పలనాయుడు, బలగ వాసుదేవరావు, బలగ జగదీష్ తదితరులు హాజరయ్యారు. గ్రామానికి చెందిన పలువురు నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ నేతలు అభినందనలు తెలిపారు.

# మునగాకులో పోషకాలు : డీఆర్‌డీఏ పీడీ



**మెళియాపుట్టి, ఫిబ్రవరి 24(వార్త):** మునగాకుతో పోషకాలు మెండుగా లభిస్తాయని శ్రీకాకుళం డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మెళియాపుట్టి మండలంలో పర్యటన చేశారు. మండలంలో మునగ ప్రాసెసింగ్‌కు సంబంధించి రూ.40 లక్షల విలువచేసే యంత్రాలు అందుబాటులో ఉన్నట్లు తెలియజేస్తూనే, దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసే బాధ్యతలు తీసుకోవాలని సంబంధిత శాఖధికారులకు సూచించారు. జగనన్న కాలనీలో గతంలో నిర్మించిన షెడ్డును ఆయన పరిశీలించి అక్కడ మిషనరీ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం చాపర గ్రామంలో పోలాకి తేజేశ్వరరావు అనే రైతుకు చెందిన ఎకరం పొలంలో మునగ తోట పరిశీలించి దిగుబడులు, లాభాలు, ఉపయోగాల తదితరు వాటి గురించి మాట్లాడారు. అనంతరం మునగ ప్రాసెసింగ్ వలన పలు రకాల ఉత్పత్తులు తయారు చేయవచ్చునని దానికి సంబంధించి కొంతమంది వాలంటీర్లకు స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి మునగ సాగు పద్ధతులను వివరించారు. ఈ సందర్భనలో ఆయనతోపాటు డిపిఎం నారాయణరావు, ఎపిఎం త్రినాధమ్మ పలువురు వెలుగు సిబ్బంది తదితరులున్నారు.

# బందపల్లి డీఆర్ డిపో పరిశీలన



**మెళియాపుట్టి, ఫిబ్రవరి 24(వార్త):** బందపల్లిలో ఉన్న డీఆర్ (జిసిసి) డిపోను ఐటీడీఏ ఏఈ ఆదినారాయణ మంగళవారం పరిశీలించారు. ఆ గ్రామంలో కొన్నాళ్లగా ఈ డిపో మరమ్మతులకి గురై నిరుపయోగంగా ఉందని, దాని స్థానంలో కొత్తగా డిపో నిర్మించి గిరిజనులకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగేలా చూడాలని ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌లో ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి బైరిసింగి దినకర్ ఇచ్చిన విజ్ఞాపన మేరకు.. స్పందించిన ఎమ్మెల్యే ఐటీడీఏ పీవో వారికి సమాచారాన్ని అందజేశారు. ఈ సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ఆదినారాయణరెడ్డి ఈ డిపోను పరిశీలించడంతోపాటు దానికి సంబంధించి ఎస్టిమేట్లు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట పాతపట్నం ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి బైరిసింగి దినకర్ ఉన్నారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్సై గణేష్

- నరసన్నపేటలో 144 సెక్షన్ అమలు
- -కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**నరసన్నపేట, ఫిబ్రవరి 24(వార్త):** నరసన్నపేటలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకుని హాజరయ్యారు. పరీక్షల నేపథ్యంలో ఎస్సై గణేష్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు ఆయన తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఉన్న ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లను తాత్కాలికంగా మూసివేసినట్లు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు.




# చంద్రుపుట్టుగలో ఎంపీపీ పరామర్శ

**కంచిలి, ఫిబ్రవరి 24(వార్త):** చిన్నకొజ్జిరియా పంచాయతీ చంద్రుపుట్టుక గ్రామంలో ఇటీవల పార్టీ అభిమాని చెత్తా మురళి అనారోగ్యంతో మరణించడంతో ఆయన చిత్రపటానికి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి మంగళవారం పరామర్శించి నివాళు లర్పించారు. కుటుంబ్బీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు వజ్జ మృత్యుంజయ, కొనపల సురేష్, సర్పంచ్ గోనప సీతారాం, వైస్ సర్పంచ్ చేత్తా మదన్, భీమారావు తదితరులు పాల్గొన్నారు.



# పూడికలతో నిండిన రంగసాగరం



- -సారవకోటలో సరిగా ప్రవహించని ప్రధాన కాలువ
- - ఉపాధి హామీ ద్వారా పూడిక తొలగించాలని రైతుల విజ్ఞప్తి

**సారవకోట, ఫిబ్రవరి 24(వార్త):** సారవకోట మండలంలోని రంగ సాగరం ప్రధాన పంట కాలువ పూడికలతో నిండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు వేయి ఎకరాలకు సాగునీరు అందించే ఈ కాలువలో పూడికలు పేరుకుపోవడంతో నీటి ప్రవాహం తగ్గిపోయిందని రైతులు తెలిపారు. ప్రతి ఏడాది రబీ సీజన్‌లో శ్రమదానం ద్వారా కాలువలోని పూడికలను రైతులే తొలగించుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. అయినప్పటికీ శాశ్వత పరిష్కారం లేకపోవడంతో సమస్య కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాదైనా అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలోని పూడికలను తొలగించి నీటి ప్రవాహాన్ని సక్రమంగా పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. సాగునీరు అందుబాటులో ఉంటే పంటలు మెరుగ్గా పండుతాయని వారు పేర్కొన్నారు.

# జిల్లా గ్రంథాలయ సంస్థలో 70 ఖాళీలు

**-సెస్సులు విడుదల చేయాలి**

**-జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శంకరరావు విజ్ఞప్తి**

**సారవకోట, ఫిబ్రవరి 24(వార్త):** జిల్లా గ్రంథాలయ సంస్థలో 70 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని తక్షణం భర్తీ చేయాల్సిన అవసరం ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శంకరరావు తెలిపారు. మంగళవారం సారవకోట మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఖాళీల కారణంగా గ్రంథాలయ సేవలు సక్రమంగా అందించడం కష్టంగా మారిందన్నారు. జిల్లా పట్టణ, గ్రామీణ పంచాయతీల నుంచి రావలసిన 8 శాతం గ్రంథాలయ సెస్సులను ప్రభుత్వం విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిధులు అందితే గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.



# సబ్ జైలును సందర్శించిన డీఎల్‌హెచ్‌ఎస్ అధ్యక్షుడు హరిబాబు

**- ఖైదీల సమస్యలపై ఆరా, ఉచిత న్యాయ సేవల భరోసా**



**నరసన్నపేట, ఫిబ్రవరి 24(వార్త):** నరసన్నపేట సబ్ జైలును జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ (డీఎల్‌హెచ్‌ఎస్) అధ్యక్షుడు హరిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం సబ్ జైలర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో జైలులో ఉన్న ఖైదీలతో ఆయన మాట్లాడారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితి, మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలులో అందుతున్న సదుపాయాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. బెయిల్‌కు అవకాశం లేని ముద్దాయిలు జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తామని హరిబాబు తెలిపారు. ఖైదీల హక్కుల పరిరక్షణకు సంస్థ కట్టుబడి ఉందన్నారు.

# గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన

**- కోడూరులో శక్తి టీం పర్యటన**



**పోలాకి, ఫిబ్రవరి 24(వార్త):** నేటి సమాజంలో మహిళలతో పాటు విద్యార్థినిలకు కూడా వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఎంతో అవసరమని శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్ తెలిపారు. మంగళవారం పోలాకి మండలం కోడూరు గ్రామంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో శక్తి టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల చిన్నారుల పట్ల కూడా అఘాయిత్యాలు చోటుచేసుకుంటున్నాయని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పెద్దలకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థినులు తమ భద్రతపై జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే ధైర్యంగా చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


# గెడ్డవానిపేటలో.. ఉపాధ్యాయుల స్పెషల్ డ్రైవ్

**- 'మన ఊరి బడిని కాపాడుకుందాం' నినాదంతో తల్లిదండ్రులతో భేటీలు**

**నరసన్నపేట, ఫిబ్రవరి 24(వార్త):** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. నరసన్నపేట మండలం గెడ్డవానిపేట ప్రభుత్వ పాఠశాలకు చెందిన హెచ్‌ఎం భూషణరావు మాట్లాడుతూ, 'మన ఊరి బడిని కాపాడుకుందాం' అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను నేరుగా కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య గురించి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. గ్రామస్థుల సహకారంతో ప్రభుత్వ బడులను మరింత అభివృద్ధి చేయాలని సంకల్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







# ఉద్దానం ఆరాధ్యుడు.. వల్లభనారాయణుడు

**-మహావిష్ణువు మత్స్యవతారంగా భక్తుల నమ్మకం - 18వ శతాబ్ధంలో రట్టిలో వెలసిన నారాయణస్వామి**

**- 26నుంచి మార్చి 3వరకు స్వామి డోలోత్సవాలు -మందస సంస్థానాధీశులచే ఆలయ నిర్మాణం**

**మందస, ఫిబ్రవరి 24(వార్త):** పచ్చని తోటల మధ్య వెలసిన ఉద్దాన సుందర ఆరాధ్య దేవుడే వల్లభనారాయణస్వామి. 18వ శతాబ్ధంలో వెలసినట్టు చరిత్ర చెబుతుండగా, స్వామివారి డోలోత్సవాలు శోభాయమానంగా జరుగుతాయి. మందస మండలంలోని ఉద్దాన గ్రామమైన రట్టిలో శ్రీవల్లభ నారాయణుని డోలోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఐదు రోజుల పాటు యాత్ర జరుగుతు న్నప్పటికీ, మూడు రోజుల పాటు భక్తులు భారీ ఎత్తున తరలివస్తారు. ప్రతీ ఏటా పలాస ఏపీఎస్ ఆర్టీసీ రట్టి జాతర పేరిట ప్రత్యేక బస్సులు నడుపు తుంది. సముద్ర తీర ప్రాంతాన అందమైన కొబ్బరి తోటల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణంలో 18వ శతాబ్ధ కాలంలో మందస మండలం రట్టి గ్రామంలో శ్రీవల్లభనారాయణస్వామి ఆలయం వెలసింది. రాచరిక పాలన నుంచి ప్రతీ ఏటా శివరాత్రి 12 రోజుల తరువాత స్వామి వారి డోలోత్సవాలను నిర్వహించడం పరిపాటి. అందులో భాగంగానే ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు ఆరు రోజుల పాటు రట్టి శ్రీవల్లభనారాయణ స్వామి డోలోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సింహాచలం పుణ్యక్షేత్రంలో వెలసిన సింహాద్రి అప్పన్న, రట్టిలో వెలసిన శ్రీవల్లభనారాయణస్వామిని ఒక్కటిగా చెప్పుకునే భక్తులు ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచే కాక ఒరిస్సా రాష్ట్రం నుంచి కూడా అసంఖ్యాక భక్త జనులు స్వామి వారిని దర్శించుకోవడం విశేషం. స్వామి వారిని దర్శించుకోవడం విశేషం.

## పురాణ కథనం...

18వ శతాబ్ది ప్రారంభంలో నెల్లూరు జిల్లా బుద్ధగిరి గ్రామ నివాసులు వారి సమీప అడవిలో నిత్యము కట్టెలు కొట్టుకుంటూ జీవనోపాధి సాగిస్తూ ఉండేవారు. ఒకనాడు యధావిధిగా కట్టెలు కొడుతుండగా ఒక పాల చెట్టు నుంచి రక్తము స్రవించింది. అది చూసిన వారంతా భయాందోళనకు గురై మూర్ఛపోయారు. అదే సమయమున వారి ఇంటిలో నిద్రిస్తున్న ఆడ పడుచులకు స్వామి వారు దర్శనమిచ్చి జరిగిన విషయం చెప్పగా గ్రామ ప్రజలంతా కలసి అడవికి వచ్చి మూర్ఛపోయిన వారిని లేపి రక్తము కారిన పాలచెట్టు కాండమును భక్తి శ్రద్ధలతో పూజించారు. స్వామి వారి ఆజ్ఞ మేరకు ఆ ప్రజలు తమ భుజాన కాండమును వేసుకుని ఆ గ్రామ దేవాలయం వైపున ఉన్న సముద్ర తీరం గుండా ప్రయాణించారు. ఆకలి, అలసట లేకుండా ప్రయాణిస్తున్న వారికి నదులు, వాగులు, ఏరులు, సెలయేరులు, త్రోవనివ్వగా ప్రయాణించి రట్టి గ్రామసమీపంలో గల సముద్ర తీరం వద్దకు చేరుకున్నట్లు కథనం ప్రచారంలో ఉంది. ప్రతీ ఏటా వివేకానంద యువజన సేవాసంఘం, గ్రామ అభివృద్ధి, గ్రామపెద్దలు, యువత ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయి.

రట్టి సముద్ర తీర ప్రాంతానికి చేరుకున్న సమయంలో సింహాద్రి అప్పన్న భక్తుడు అయిన మందస సంస్థానాదీశులు రాజాజగన్నాథరాజ మణిదేవ్కు శ్రీమత్స్యవల్లభనారా యణ స్వామి కలలో దర్శనమిచ్చి స్వామి రాకను తెలియజేశారు. తక్షణమే ఆ రాజావారు సేవకులతో కలసి మంగళవాయిద్యాలతో సముద్ర తీరానికి చేరుకున్నారు. పాలచెట్టు కాండమును మూల విరాట్గా తయారు చేయబడి ఓ పుణ్యస్త్రీ చేతులు మీదుగా పూజలు ప్రారంభమయినట్లు పురాణ కథనం. అప్పటి వరకు సంతానము లేని రాజావారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం కలిగినట్లు నేటికీ చెబుతారు. అప్పటి ప్రజలు తమ సంతానం మొదటి తలనీలాలు ఇచ్చటనే చెల్లించుట ఇప్పటికీ ఆనవాయితీగా ఉంది. క్రీ.శ. 1803లో నిర్మించిన ఈ దేవాలయం నేటికీ నిత్య ధూప నైవేద్యాలతో పూజలు అందుకుంటుంది. ఆలయ ప్రాంగణంలో గల గరుడ స్థంబానికి నూతన దంపతులు ఆలింగనం చేసుకుని ఉత్తమ సంతానం కావాలని ఇప్పటికీ కోరుకుంటూ ఉంటారు. దేవుని సన్నిధిలో గల తులసికోట వద్ద జీవితాంతం పెనవేసుకునే 'నేస్తరికం' కట్టుకోవడం విశేషం. ఈ ప్రాంత ప్రజల ఏ పుణ్యక్షేత్రాలు దర్శించిన చివరగా రట్టిలో గల శ్రీమత్స్యవల్లభనారాయణ స్వామి దర్శనంతో సంపూర్ణ యాత్ర చేసినట్లు అవుతుందని ప్రగాఢ విశ్వాసం. స్వామికి ప్రీతి పాత్రమైన అమృతబాండము ముఖ్య ప్రసాదంగా ఇవ్వడం ఆనవాయితీ.




## కార్యక్రమ వివరాలు..

డోలోత్సవాల్లో భాగంగా 26న రాత్రి 9గంటలకు అంకురార్పణ, 27న ఏకాదశి సందర్భంగా పంచామృత అభిషేకములు, ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయి. 28న ధ్వజారోహణ, విశేష హోమాలు, మార్చి 1న తిరువీధి మహోత్సవములు, 2న స్వామివారికి ప్రత్యేక పూజలు, 3న డోలో పౌర్ణమి, సముద్ర స్నానం, మఘ, కామదానం, కోల సేవ జరుగుతాయి. 3న గ్రహణం కారణంగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు గుడి తలుపులు మూసి వేయబడతాయని, భక్తులు గమనించాలని కార్యనిర్వహణాధికారి, వివేకానంద యువజనసంఘం, రట్టి గ్రామ ప్రజలు, పూజారులు, పూజ కమిటీ నాయకులు సంయుక్తంగా తెలిపారు. డోలోత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు. శ్రీ స్వామి వారి దేవాలయం నందు భజనలు మరియు ప్రోగ్రామ్స్ జరుపబడును. బరంపురం, ఇచ్ఛాపురం, సోంపేట, టెక్కలి, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుండి వచ్చు యాత్రికులకు మందస రోడ్ అనగా హరిపురం జంక్షన్ వద్ద దిగవలెను. అక్కడి నుంచి రట్టి గ్రామమునకు 3 మైళ్లకు బస్సు సౌకర్యం కూడా కలదు. ఏపీఎస్ఆర్టీసీ రట్టి యాత్ర పేరిట ప్రత్యేక బస్సులు నడుపుతుంది.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## టెక్నీషియన్ శిక్షణకు ఎంపిక

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 24(వార్త):** సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్ ప్రైజ్ డెవలప్ మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సిడాప్), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో వినిని స్కిల్ అకాడమీ, డిడియూ -జి కె వై,యూత్ ట్రైనింగ్ సెంటర్ (వి టి సి ), సోలార్ ప్యానెల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్, మల్టీ స్కిల్ టెక్నీషియన్ కన్స్యూమర్ డ్యూరబుల్స్‌లో శిక్షణ మరియు ఉపాది కొరకు నియామకాలు ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డి.ఆర్.డి.ఎ, పథక సంచాలకులు పి. కిరణ్ కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ మందస మండలంలోని కుంటికోటలోని యువత శిక్షణ కేంద్రంలో ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. ఈ శిక్షణ కొరకు కనీస విద్యార్హత ఎస్ ఎస్ సి, శిక్షణ కాల వ్యవధి 3 నుండి 6 నెలల, వయస్సు 18-35 సంవత్సరాలుగల అభ్యర్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. శిక్షణ కాలం లో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, శిక్షణ మెటీరియల్, సర్టిఫికేట్ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామన్నారు. శిక్షణ కొరకు ఇంటర్వ్యూకు హాజరు అగు అభ్యర్థులు తమ విద్యార్హత ధృవపత్రములతో పాటు బయోడేటా, ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9390339833, 8978144124 మొబైల్ నెంబర్ కు సంప్రదించవచ్చునని తెలిపారు.

## ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ప్రవేశ పరీక్షలు మార్చి 8కి వాయిదా

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 24(వార్త):** పెద్దపాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ప్రవేశ పరీక్ష మార్చి 2వ తేదిన జరగాల్సిన పరీక్షలు మార్చి 8వ (ఆదివారం)తేదికి వాయిదా వేయడం జరిగిందని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ దేవి తెలిపారు. 5వ తరగతి మరియు జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష షెడ్యూల్ ప్రకారం యథావిధిగా మార్చి 1వ(ఆదివారం) తేదిన జరుగుతుందని తెలిపారు. హాల్ టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకోవలసిందిగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ దేవి తెలిపారు.

## పశువైద్యశాలలు పేరుకే మిగిలాయి

* మందులు, పరికరాలు లేవు, సిబ్బంది లేరు
* కూటమి ప్రభుత్వం వచ్చాకే పశుసంవర్ధక శాఖ పునరుజ్జీవనానికి చర్యలు
* వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 24 (వార్త):**గత ఐదేళ్లలో పశుసంవర్ధక శాఖ నిర్వీర్యమయిందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శాసనసభలో ఎమ్మెల్యేలు పశు వైద్యశాలల్లో సౌకర్యాల కొరత, వైద్యుల నియామకాలపై అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో పశుసంవర్ధక శాఖలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, రైతులు, పశు పాలకులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కూడా అందించలేని దుస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. పశువుల చికిత్సకు అవసరమైన మందులు, ఆధునిక పరికరాలు లేవని, ఉన్న భవనాలు శిథిలావస్థలో ఉండగా, వాటిని చూసుకునే సిబ్బంది కూడా లేకుండా శాఖను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖ ద్వారా మొత్తం 3176 కేంద్రాలు పనిచేస్తున్నప్పటికీ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వీటిలో చాలా కేంద్రాలు పేరుకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. రైతుల విరాళాలతో నిర్మించిన పాత భవనాలను కూడా సంరక్షించలేక, వాటిని శిథిలావస్థకు నెట్టారని ఆరోపించారు. గత ఐదేళ్ల పాటు పశుసంవర్ధక శాఖకు నిధులు కేటాయించకుండా, మౌలిక సదుపాయాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, ఫలితంగా పశువైద్యశాలలు మందులు, సిబ్బంది లేక రైతులకు ఉపయోగపడని పరిస్థితిలోకి వెళ్లాయని మంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిస్థితిని సమీక్షించి, పశుసంవర్ధక శాఖ పునరుజ్జీవనానికి చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో ఇప్పటివరకు 485 భవనాలు నిర్మించినట్లు వివరించారు. 826 పశు సంస్థలకు సంబంధించిన భవనాలు దయనీయస్థితిలో ఉన్నాయని, వీటిలో 400 సంస్థలకు వెంటనే కొత్త భవనాలు అవసరం ఉండగా ఇందుకు రూ.265.10 కోట్లు, మరో 426 సంస్థలకు తక్షణ మరమ్మతుల కోసం రూ.37.40 కోట్లు అవసరమని మంత్రి వెల్లడించారు. ఈ అన్ని అవసరాలను దృష్టిలో పెట్టుకొని, 2026--27 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరాల మధ్య, బడ్జెట్ కింద దశల వారీగా పశువైద్యశాలల భవనాల నిర్మాణం, మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందన్నారు. గత ప్రభుత్వంలా శాఖలను నిర్వీర్యం చేయడం కాకుండా, రైతులు, పశుపాలకులకు వాస్తవంగా ఉపయోగపడే విధంగా పశుసంవర్ధక శాఖను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## పోస్టర్ ఆవిష్కరణ

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 24(వార్త):** జాతీయ సేవా పథకం మరియు మేర యువ భారత్ సంయుక్తం గా వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ప్రోగ్రాం ను జిల్లా స్థాయి ఎలాక్యూషన్ పోటీలను మార్చి 5వ తేదిన డా.బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ ఎచ్చెర్ల లో నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కెఆర్ రజని చెప్పారు. మంగళవారం సంబంధిన పోస్టర్‌ను డా.బి. ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ చేతుల మీదుగా విడుదల చెయ్యడం జరిగింది. 18-25 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి యువకులు మార్చి 2వ తేదీ లోపల మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకొని, మార్చి 5వ తేదిన జరగబోవు పోటీలలో పాల్గొనవాల్సిందిగా తెలియచేశారు. 18--25 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులను వికసిత భారత్ యువ పార్లమెంట్ - 2026లో నమోదు చేసుకొని పాల్గొనడానికి ప్రోగ్రామ్ ఆఫీసర్లు మరియు అధ్యాపక సభ్యులందరు ప్రోత్సహించాలన్నారు.

## జనగణనపై మూడు రోజుల శిక్షణ



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 24 (వార్త):** జనగణన-2027 నిర్వహణకు సంబంధించి శ్రీకాకుళం, ఎచ్చర్ల, శివాని ఇంజనీరింగ్ కాలేజీలో జిల్లా, ఛార్జ్ అధికారులకు ఈనెల 26 వరకూ మూడు రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ జనగణన కార్యకలాపాల జాయింట్ డైరెక్టర్, బి .వి .ఎల్ .సాయి శేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ జనగణన నమోదుకు సంబంధించి పూర్తి వివరాలు, మే ఒకటవ తేదీ నుండి మే 31 లోగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల నివాసాలను గుర్తించాలని అన్నారు. ఎల్యూమి లెటర్స్ మరియు సూపర్వైజర్లు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేలా సంబంధిత అధికారులు తగు ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, తాహాశీల్దారులు, ఎం.పి.డీ.వోలు, జిల్లా గ్రామ పాపులేషన్ వివరాలు పూర్తి చేయుటలో సంబంధిత సిబ్బందికి ఒక ప్రణాళికా బద్దంగా వారికి జనాభా నమోదు శాతాన్ని కేటాయించాలని తెలిపారు. ఈ ప్రక్రియ తదుపరి ఫిబ్రవరి 2027 లో జరుగుతుందని తెలిపారు. ఈ మూడు రోజుల శిక్షణలో జనగణన--2027 లక్ష్యాలు, చట్టపరమైన నిబంధనలు, జనగణన సిబ్బంది పాత్ర, నిధుల నిర్వహణ, మానవ వనరుల వినియోగం మరియు ప్రచార కార్యక్రమాలపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర సమాచారాన్ని వివరించారించుట జరుగుతుందని తెలిపారు.మాడ్యూల్స్, యూజర్ నమోదు, నిర్వహణ, శిక్షణ నిర్వహణ, నియామక ఉత్తరాలు, ఐడీ కార్డుల జారీ విధానం వంటి అంశాలపై ప్రాక్టికల్ డెమో నిర్వహించడం జరుగుతుందని. గ్రామం/పట్టణం/ఛార్జ్ రిజిస్టర్ల తయారీ, నూదీ క్రియేటర్ ద్వారా నూదీ విభజన మరియు లేఅవుట్ మ్యాప్ తయారీపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే స్వీయ గణన ప్రక్రియ, సమాచార దాత, గణనాధికారి మరియు పర్యవేక్షకుల బాధ్యతలు, నూూ మొబైల్ యాప్ వినియోగం, డేటా ధృవీకరణ, డేటా నైతికత, గోప్యత మరియు భద్రత అంశాలపై అవగాహన కల్పించుట జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగణన జాయింట్ డైరెక్టర్ బి. వి. ఎల్. సాయి శేఖర్, రెవెన్యూ , ముఖ్య ప్రణాళిక, జిల్లా విద్య ,పంచాయతీ, ఫారెస్ట్ ,జిల్లా పరిషత్, సర్వే శాఖల, అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అదుపులోనే అతిసారం: కలెక్టర్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 24 (వార్త):**జిల్లా కేంద్రంలోని దమ్మలవీధి, గుడివీధి, మంగువారితోట, కాకివీధి ప్రాంతాల్లో ప్రబలిన అతిసారం ప్రస్తుతం అదుపులోనే ఉందని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేసులు వెలుగుచూసిన వెంటనే అధికార యంత్రాంగం అప్రమత్తమైందని, వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, రెవెన్యూ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ముమ్మర చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం 52 కేసులు నమోదు కాగా, బాధితులను రిమ్స్, కిమ్స్, జెమ్స్ వంటి ఆస్పత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నామని వివరించారు. దురదృష్టవశాత్తు ఒకరు మృతి చెందారని, ఐదుగురు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని అన్నారు. అతిసార ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటల పాటు వైద్య శిబిరాలు, యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి వీధికి ఒక వైద్య బృందం, శానిటేషన్, ఇంజినీరింగ్, ప్లానింగ్ బృందాలను కేటాయించి పారిశుధ్య పనులు, పైపులైన్ల లీకేజీల తనిఖీలను వేగవంతం చేశామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, తొమ్మిది మంది కీలక అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. అత్యవసర పరిస్థితుల కోసం దమ్మలవీధిలో నాలుగు అంబులెన్స్‌లను నిరంతరం అందుబాటులో ఉంచామని, పరిస్థితి చక్కబడే వరకు వైద్య బృందాలు అక్కడే ఉండి సేవలు అందిస్తాయని స్పష్టం చేశారు. వ్యాధి నివారణకు ప్రజలు







వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తప్పనిసరిగా నీటిని కాచి చల్లార్చి తాగాలని కలెక్టర్ సూచించారు. సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీతో పాటు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

### 'కంట్రోల్ రూమ్' ఏర్పాటు..

నగరంలోని పలు వీధుల్లో అతిసారం ప్రబలిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. బాధితులకు తక్షణ వైద్య సాయం అందించడం, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించడం కోసం కలెక్టరేట్‌లో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 08942-229080 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, ఎవరికైనా సహాయ, సహకారాలు కావాలన్నా ఈ నంబరు ద్వారా సంప్రదించవచ్చని ఆయన కోరారు.

### రూ.10 లక్షల పరిహారం: ఎమ్మెల్యే గొండు

శ్రీకాకుళం నగరంలో ఇటీవల ప్రబలిన డయేరియా కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ ఘటనలో కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందన్నారు. ఈ సహాయాన్ని వీలైనంత త్వరగా బాధితులకు అందించేందుకు సంబంధిత అధికారులకు ఇప్పటికే తగిన ఆదేశాలు జారీ చేశామన్నారు. డయేరియా నియంత్రణకు నగరంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వైద్య సేవలను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు, పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వ్యాధి పూర్తిగా అదుపులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ భరోసా ఇచ్చారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

### ఎమ్మెల్యే సతీమణి సైతం..

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి శంకర్ మంగళవారం రిమ్స్, తదితర ఆసుపత్రులను సందర్శించారు. డయేరియాతో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు.

## డయేరియా బాధితులకు బీజేపీ నేతల పరామర్శ

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 24 (వార్త):**దమ్మలవీధి, కాకివీధి, గుడి వీధి, మొండేటి వీధిలలో డయేరియాతో బాధపడుతున్న వారిని బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, నాయకులతో కలిసి పరామర్శించారు. ప్రభుత్వపరంగా వైద్యసేవలు అందేలా చూస్తామన్నారు. ఆయన వెంట మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవి బాబ్జి, సెవ్వనా ఉమామహేశ్వరి, జిల్లా కార్యదర్శి బైపల్లి రాజేశ్వరి, యువమోర్చ నాయకులు ధన్నాన మదన్, మండల అధ్యక్షులు,మహిళా మోర్చా నాయకులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



# ప్రభుత్వ వైఫల్యమే కారణం: ఎంవీ పద్మావతి

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 24 (వార్త):** శ్రీకాకుళం పట్టణంలో అతిసారం వ్యాధి తీవ్రంగా వ్యాపించడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని వైసీపీ సీనియర్ నాయకురాలు , మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి ధ్వజమెత్తారు. అతిసార కేసులు పెరుగుతున్నా ఇంకా మెరుగైన చర్యలు లేకపోవడం అత్యంత ఆందోళనకర విషయమన్నారు. డయేరియాతో ఒకరు మృతి చెందడం బాధాకరమన్నారు. బాధితులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నాను. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన వైద్య సహాయం అందించాలని అధికారులను కోరాను. ఇలాంటి పరిస్థితి ఏర్పడటానికి ప్రధాన కారణం ప్రభుత్వ నిర్లక్ష్యం, తాగునీటి సరఫరాలో లోపాలు, పారిశుద్ధ్య వ్యవస్థలో వైఫల్యమని మండిపడ్డారు.

### ప్రభుత్వ అసమర్ధతే కారణం: రామ్ మనోహర్ నాయుడు

ప్రజల జీవితాలతో చలగాటమాడటం కూటమి ప్రభుత్వానికి తగదని వైసీపీ యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు అగ్రహం చెందారు. జిల్లా కేంద్రంలో డయేరియా ప్రబలి పదుల సంఖ్యలో ప్రజలు ఆస్పత్రుల పాలు కావడానికి కూటమి ప్రభుత్వ అసమర్ధతే కారణమని ఆందోళన వ్యక్తం చేవారు. రహదారి మరమ్మతు పనుల వల్ల తాగునీరు కలుషితం అవుతుందని తెలిసినా, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. అధికారులు, పాలకులు క్షేత్రస్థాయి పరిస్థితులను గాలికొదిలేయడం వల్లే అమాయక ప్రజలు అస్వస్థతకు గురయ్యారన్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు సాధు వైకుంఠం, మండవల్లి రవి, భయ్యా, కన్నబాబు, అల్లిబిల్లి విజయ, మాలపల్లి లత, పొన్నడ రుషి, రమేష్, గుడ్ల దామోదర్, ఎన్ని చక్రవర్తి, గుంటముక్కల పాపారావు, తెలుగు రమేష్ఎంకే బెగ్, భరత్వాజ్, కింజరాపు రమేష్,అప్పుయాదవ్, బైపురెడ్డి నాని వైఎస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.







Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546